# జీవిత పరమావధిని గ్రహించండి

వేదవేదాంగములు వల్లె వేయవచ్చు
పద్యగద్యంబులను గూర్పుచేయవచ్చు
చిత్తశుద్ధియె శృతులకు జీవనాడి
సామవేదపు ఊట శ్రీసాయిమాట.

**దివ్యాత్మస్వరూపులారా!**

ఈ ప్రపంచములో జీవిత పరమావధి అంటే ఏమిటో చాలా మందికి బోధపడదు. కాని అర్థంకాలేదని కూడను ఎవ్వరు విచారించరు. నూటికొక్కరో కోటికొక్కరో దీనిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నమే జీవిత పరమావధికి ప్రథమ సోపానము. కానీ చాలామందికి కడుపుకు తిండి, కంటినిండా నిద్ర, వంటి నిండా దుస్తులు ఇంటినిండా పిల్లలు ఉంటే ఇదియే జీవిత పరమార్థమని తలుస్తూ ఉంటారు. ఇదియే జీవిత పరమార్థం కాదు. ఇది కేవలము జీవిత పరమావధి. జీవితమునకు ఇవికూడను అత్యవసరమే. కాని మానవుడు తన బుద్ధిని బాహ్యదృష్టిగా మరల్చి కేవలము బాహ్యమైన జ్ఞానమునే ఆర్జించుటకు ప్రయత్నిస్తున్నాడు. కాని అంతర్ముఖముగావించుకొనుటకు, ఆత్మ జ్ఞానమునకు తగిన కృషి చేయటం లేదు.

వారధి గట్టు పై నిలచి పైపై విషయములను పరికించినప్పుడు కేవలం అలలు మాత్రమే గోచరించునుగాని ఆణిముత్యములు గోచరించవు. ఏ ధీరుడు సముద్రములో దుమికి అట్టడుగుకు పోయి ఈ ముత్యములు అన్వేషణ సలుపునో వానికి మాత్రమే ఈముత్యములు లభ్యమగునుగాని అన్యులకు లభ్యంకాదు. భౌతిక పరిశోధనలు, పరిశీలనలు కట్టిపెట్టి అంతర పరిశోధనలకు తగిన కృషి చేసినప్పుడే ఈ ఆత్మజ్ఞానము మనకు లభ్యమవుతుంది. ఆత్మజ్ఞానము అంత సులభమైనది కాదు. కనుకనే అనాదికాలము నుండి అనేక విధముల వేదములనుచ్చరించుచు, వల్లె చేయుచు దానిని నిముష నిముషము స్మరిస్తూ ఉండిన ప్రభువులు, ప్రజలు భారతదేశములో

srisathyasaivachanamrutam

ఉండినప్పటికి వారికి తగిన ఫలము అందుకోలేక పోవటానికి కారణమేమిటో కొంత విచారించాలి.

మంత్రద్రష్టలైన మహనీయులు కేవలము పైపై మంత్రములు మాత్రమే ఉచ్చరిస్తూ వస్తున్నారుగాని దానియొక్క అంతరార్థముగాని, దానియొక్క మంత్రశక్తిగాని పవిత్రతనుగాని గుర్తించి వర్తించేవారు చాలాతక్కువ. అయితే ఈ వేదములందున్న ఒక మహత్తర విషయాన్ని మనం విచారించినప్పుడు వేదము అర్థము కాకపోయినా, వేదము శ్రవణము చేయగనే మనయందు కొన్ని విధములైన పవిత్రతలు అభివృద్ధి అవుతాయి. వేదమంత్రములందున్న పవిత్రమైన శక్తి మంత్రశక్తిగా మారి తనయొక్క దివ్యశక్తిని కూడా చేర్చుకొని పవిత్రమైన స్వరముతో ఇతరులకు శ్రవణానందము అందించటము ఈ వేదముయొక్క మహత్తరమైన శక్తి. కనుకనే అష్టవిధములైన శక్తులలో శ్రవణం ప్రధానమైనది. భగవంతుడు అష్టైశ్వర్య స్వరూపుడని మొదటి ఐశ్వర్యము శ్రవణమేనని, శ్రవణం చేతనే నిధి ధ్యాసలు ప్రాప్తిస్తాయని వేదముయొక్క ప్రమాణము. భక్తి మార్గమునందు కూడా శ్రవణమే ప్రధానమైన స్థానం ఆక్రమించుకుంది. శుద్ధ బ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి. ఈ అష్టైశ్వర్య స్వరూపములు వేదముయొక్క స్వరూపములు. ఈ విధమైన అష్టైశ్వర్యములే పామరులకు ఈ విధమైన భాషలో అర్థంకాదని గుర్తించి భక్తిమార్గములో అతి ప్రధానమైనది శ్రవణమని భావించి

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

అన్నారు. శ్రవణం ప్రధానమైన స్థానములోఉంది. అయితే దురదృష్టవశాత్తు దీనిని శ్రవణం కూడా చేయని వ్యక్తులు మన భారతదేశంలో ఉన్నారు. శ్రవణం చేసే అవకాశం లభించి కూడను శ్రవణం చేయక తప్పించుకు తిరిగేవారు మన భారతదేశంలో ఉన్నారు. శ్రవణం చేస్తూ కూడను సుస్పష్టమైన మంత్రములను శ్రవణం చేయకుండా ఏదో ఒక శబ్దమును మాత్రమే శ్రవణం చేసేవారు కూడను మన భారతదేశంలో ఉన్నారు. దీనికి కారణమేమిటి? దీనికి కారణం పురస్కరించుకొని అనేక విధములైన సులభమార్గములు కూడను వేదము

srisathyasaivachanamrutam

ప్రబోధిస్తూ వచ్చింది.

శరీరమునకు వాత, పిత్త, శ్లేష్మములనే దోషములావరించినాయి. వాతమునకు 40 విధములైన రోగములు ఆవిర్భవిస్తున్నాయి. పిత్తము చేత మానవుని యొక్క దేహములో 42 రకములై రోగములావిర్భవిస్తున్నాయి. శ్లేష్మము చేత 244 రకములైన వ్యాధులు మానవునియందు పుట్టుచున్నవి. ఇవన్నీ చేరిన 326 రకములైన రోగములతో కూడినది ఈ మానవదేహము. రోగముల కొంప ఈదేహము. మలినపు గంప ఈ దేహము. ఇట్టి దేహముపై అభిమానముంచుకొని దేహిని విస్మరించి భౌతికమైన సుఖసంతోషములే ప్రధానమని భావించి అంతర్ముఖమును మర్చిపోతున్నారు మానవులు. దేహమునకు వాతపిత్త శ్లేష్మాదులు ఏవిధమైన దోషములో అంతఃకరణమునకు కూడా మల విక్షాప ఆవరణములు అనే మూడు వ్యాధులు సంభవిస్తున్నాయి. అంతఃకరణమునకు ఈ మలవిక్షేప ఆవరణములనే దోషములు పట్టటంచేత మానవుడు ఈ అంతర్ముఖమైన భావములు అభివృద్ధిగావించుకోలేక పోతున్నాడు. ఆత్మ జ్ఞానమును చింతించలేకపోతున్నాడు. ఆశించలేకపోతున్నాడు. భౌతికమే నిత్యజీవితముగా భావిస్తున్నాడు. ఇదియే మానవునియందున్న అజ్ఞానమునకు మూలకారణము.

**మల విక్షేప ఆవరణములు**

మలములకు అవిద్యయని మరొకపేరు. ఈ మలము కేవలం కర్మల ద్వారా నశిస్తుంది. ఇంక ఈ ఆవరణ మనేది కేవలం ఉపాసన ద్వారా క్షీణిస్తుంది. విక్షేపము అనేది విచక్షణా జ్ఞానముతో నశిస్తుంది. కనుకనే ఈ మూడింటికి కర్మ ఉపాసన జ్ఞానములు అత్యవసరమని వేదము బోధిస్తూ వచ్చింది. కర్మవలన చిత్తశుద్ధియు, ఉపాసన వలన చిత్తైకాగ్రతయు, జ్ఞానము చేత మోక్షప్రాప్తియు లభ్యమవుతుంది. మోక్షప్రాప్తి అనగా ఏదో ఒక ప్రత్యేకమైన స్థానమునకు పోవటమనిగాని, భగవంతునిలో లీనమవటమనిగాని ఇంకేవిధమైన దివ్యత్వాన్ని పొందటమనిగాని భారతీయులు భావిస్తున్నారు.

ఈ జీవితములో సంభవించే సుఖ దుఃఖములకు మూలకారణమేమిటి అనే విషయాన్ని విచారించటం లేదు. ఈ దుఃఖమునకు మూలకారణం జన్మయే. ఈ జన్మకు మూలకారణం కర్మయే. ఈ కర్మకు మూలకారణము రాగము. ఈ రాగమునకాధారము అభిమానము.



sri sathyasai vachanamrutam

'అభిమానమునకాధారము అవివేకము. అవివేకమునకు ఆధారం అహంకారము. ఈ అహంకారమునకు మూలాధారం అజ్ఞానము. అజ్ఞానము నశించినపుడే అహంకారమణగిపోతుంది. అహంకారము అణగినప్పుడే అవివేకం క్షీణిస్తుంది. అవివేకము క్షీణించినప్పుడే రాగమనేది నశిస్తుంది. రాగము నశించినప్పుడే కర్మ క్షీణిస్తుంది. కర్మ క్షీణించినప్పుడే జన్మ సార్థకమవుతుంది. ఈ జన్మమున లభించిన దుఃఖమునకు మూలకారణము అజ్ఞానమే అని స్పష్టమవుతున్నది. కనుక మానవత్వములో ఉన్న ఈ అజ్ఞానమునకు మూలకారణము ఒకవిధమైన ఆవరణము. దానికి పూర్వముగా ఉండినదే మలము.

మలమనగా ఏమిటి? ఇది కేవలము పంచభూతములతో కూడి పంచేంద్రియములతో చేరి, పంచకోశములలో ఉండి బాహ్యమైన శరీరకంగా అనుభవించే ఈ అంతఃకరణమే తానని భావించటమే ఒక మలము. ఈ మలము యొక్క ప్రభావము చేతనే మానవుడు తన స్వరూపాన్ని విస్మరిస్తున్నాడు. ఈ బాహ్యమైన మలమూత్ర దుర్గంధ మాంస రక్తములతో కూడిన ఈ దేహమే తానని భ్రమిస్తున్నాడు. ఇది సత్యమునకు విరుద్ధమైనది. ఇది పవిత్రతకు విరుద్ధమైనది. సత్యమునకు విరుద్ధమైనది అసత్యమే. పవిత్రతకు విరుద్ధము అపవిత్రమే. అది మన నిత్య జీవితములో మలము అంటే ఏమిటో అనేది వేదాంత పరిభాషలో గుర్తించని వ్యక్తులు చక్కగా అర్థం చేసుకోవచ్చు. ప్రతిమానవుడు కూడా మలవిసర్జన చేస్తున్నాను అంటాడు. ఈ మలవిసర్జన అపవిత్రమని భావిస్తున్నాము. ఈ అపవిత్రమునకు ఆధారముపవిత్రమే. పవిత్రమైన ఫలమును భుజిస్తున్నాము. పరిశుద్ధమైన ఆహారము తీసుకుంటున్నాము. ఇంకా పవిత్రమైన పాలు పెరుగు ఇలాంటివి దినము భుజిస్తున్నాము. కాని కట్టకడపటికి ఈ పవిత్రమైన ఆహారము, పరిశుద్ధమైన ఆహారము అపవిత్రమైన మలంగా మారిపోతున్నది.

పవిత్రతకు విరుద్ధమైన పదార్థమే మలము. సత్యమునకు విరుద్ధమైన అసత్యమే మలము. ఆనందము మనసత్య స్వరూపము. దుఃఖము మన అసత్య స్వరూపము. సుఖము మన సత్యస్వరూపము. అసుఖము మన అసత్య స్వరూపము. కనుకనే అసత్య స్వరూపాన్ని సత్యముగా భావించుకోటమే మలము. కనుక ఈ మలము అనగా కేవలం అనిత్యము అశాశ్వతమైన అంతఃకరణమే తానని భావించుకోవటమే ఇందులో మలము. దీనినేరీతిగా మనము నిర్మూలము

గావించుకోవాలి. దానికే వేదము అనేక మార్గములు ప్రబోధిస్తూ వచ్చింది. సత్కర్మలాచరించు. ఏమిటి ఈ సత్కర్మలు? అవియే యజ్ఞయాగాది క్రతువులు. దాన ధర్మాది కర్మలు. భగవదర్పితమైన కర్మలనే సత్కర్మలుగా భావించుకోవచ్చును. ఇట్టి పవిత్రమైన కర్మలద్వారా చిత్తశుద్ధి మనకేర్పడుతుంది. చిత్తశుద్ధి అనగా దీనికి పూర్వము హృదయంలో చేరిన మాలిన్యములు మరుగు పడిపోతుంది. అనేక విధములైన సంస్కారములచేత, ఆచారములచేత భ్రమల చేతను ఈ చిత్తములో కొంత మాలిన్యమేర్పడింది. కనుక మానవుడు చేసే సర్వసత్కర్మల ద్వారా చిత్తశుద్ధియేర్పడుతుంది. కనుకనే చిత్తస్యశుద్ధయే కర్మః అన్నారు. అనగా మలమును దూరం చేసుకొని పరిశుద్ధం చేసుకోవటమే ఈకర్మ మార్గమునందున్న కర్మకాండయందున్నటువంటి విశిష్టమైన అర్థము.

ఇంక ఆవరణము. ఆవరణమంటే ఏమిటి? ఆవరించినటువంటిదే ఆవరణ. ఏది ఆవరించింది. మానవునియందు తమ స్వరూపాన్ని మరపింపచేసే కామక్రోధ లోభమోహ మద మాత్సర్యమనే గుణములు ఆవరించినాయి. రాగద్వేషములనే భావము లావరించినాయి. తద్వారా మానవుడు తనను తాను మరచి మదము తలకెక్కి ధనబలమును, భుజబలమును, బుద్ధి బలమును విద్యాబలమును జనబలమును ఆధారం చేసుకొని మిడిసిపడుతున్నాడు మానవుడు. ఈ మిడిసిపోవటంలో తనను తాను మరచిపోతున్నాడు. మరచిపోయి విచక్షణా జ్ఞానం క్షీణించిపెద్ద చిన్న అనే తారతమ్యమును పాటించక పెద్దలను అగౌరవపరచటము, అవమానపరచటము, దూషించటము, విమర్శించటము, హాస్యము గావించటము ఇత్యాది అహంకార వృత్తు లతనిలో అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఇట్టి దుర్గుణములన్నీ తన స్వరూపాన్ని మరుగు చేసి, తన దివ్యత్వాన్ని విస్మరింప చేస్తూ వచ్చాయి. ఇట్టి ఆవరించిన దుర్గుణములను దూరం గావించుకునే నిమిత్తమై ఉపాసన అత్యవసరమనే వేదము భావించింది.

**భక్తి అనగా భగవంతునితో స్నేహము**

దుర్గంధము ఉన్నస్థానములో ఒక సుగంధపు వూదొత్తులు పెట్టినప్పుడు ఆ దుర్గంధమే రీతిగా మనకు సోకదో అదే విధముగా ఈ దుర్గంధ మావరించిన మానవుని చిత్తములో భగవన్నామము ఉచ్చరించటంచేత ఈ యొక్క దుర్గుణములు దూరం కావచ్చు. భక్తి అనగా

srisathyasaivachanamrutam

ఏమిటి? భక్తి అనగా భగవంతునితో స్నేహము. భగవంతునితో సన్నిహిత సంబంధము. భగవంతునిపై ప్రేమ. అతనియొక్క సేవయే భక్తి. కనుకనే హృషీకేశ సేవనం భక్తి రుచ్యతే అన్నాడు నారదుడు. భగవంతుని నామము నాలుకపై నాట్యమాడుస్తూ, భగవంతునియొక్క స్నేహమును దినదినమునకు అభివృద్ధిగావించుకొని స్థిరముగా వించుకుంటూ ఈమైత్రి మనలో ఆధారం కావటంచేత భగవంతునికి, భక్తునికి సన్నిహిత సంబంధ బాంధవ్యము పెరగటం చేత ఈమైత్రి ద్వారా కరుణ మనలో ఆవిర్భవిస్తుంది. ఈ కరుణ ద్వారా ఉపేక్ష. ఎవరియందు ఎట్టి ద్వేషంగాని, మోహముగాని రాగముగాని లేక దివ్యమైన భావముతో తాను ఆనందాన్ని అనుభవిస్తాడు. కనుకనే ఈ యొక్క భక్తికి సత్సంగము అత్యవసరము. ఈ సత్సంగము ద్వారా మనలో మొలచిన ప్రేమ బీజము దినదినాభివృద్ధి పొందుతుంది. ఈ మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష ఈనాలుగు కూడా అభివృద్ధి కావటం చేత చిత్తైకాగ్రత సంభవిస్తుంది. కనుక భక్తి ద్వారా చిత్తైకాగ్రత ప్రాప్తిస్తుంది. కర్మవలన చిత్తశుద్ధి, భక్తి వలన చిత్తైకాగ్రత.

ఇక మూడవది జ్ఞానము. జ్ఞానమంటే ఏమిటి? ఈ జ్ఞానములు అనేక రకములైన జ్ఞానములున్నాయి. లోకజ్ఞానము భౌతిక జ్ఞానము ఒకటి. కేవలం జనరల్ నాలెడ్జి ఒకటి ఉంది. సామాన్య తెలివితేటలు. కాని ఇవి భౌతికమైనవి కావు. ఇది ఆత్మజ్ఞానము. కేవలము శరీరమును గురించిగాని లేక ఇంద్రియములను గురించిగాని, విషయములను గురించిగాని ఇంకే విధమైన ప్రకృతిని గురించి గాని విచారణ చేయటంకాదు. ఈ విధమైన భౌతికమైన విచారణలు చేయటంచేత కేవలం భౌతికమైన విషయాలు మనకు గోచరిస్తున్నాయి. కాని ఆధ్యాత్మికమునందు లోతుకు దిగి విచారణ చేసినప్పుడు ఈ ఆత్మజ్ఞానము కొంతవరకు మనకర్థమవుతుంది.

ఈ ఆత్మ జ్ఞానమనేది గురువులు బోధించుటకు వీలుకాదు. గ్రంథములు చదువుట వల్ల సాధ్యంకాదు లేక మరొకరు ఇస్తే పుచ్చుకునే వస్తువు కాదు ఇది. తన అంతఃకరణమునుండి ఆవిర్భవించాలి. అయితే గురువులుగాని గ్రంథములుగాని కొంతవరకు బోధించవచ్చు. కాని ఆచరించ దగిన వ్యక్తి తను అనుభూతిలోనికి తెచ్చుకోవాలంటే తనకు తానే విచారణ చేయాలి. తనకు తాను అనేక రకములైన విచారణలు సల్పాలి. విమర్శలు చెయ్యాలి. పరిశోధనలు

sri sathyasai vahini

సల్పాలి. పరిశీలనలో తాను స్థిరంకావాలి. తల్లికి బిడ్డ ఉంటుంది. బిడ్డలకు మాటలు నేర్పాలంటే తల్లి, అమ్మ, అప్ప అని తననోటితో పలుకుతుంది. ఆ బిడ్డ తల్లినోరు చూసి అమ్మ, అప్ప అనేది నేర్చుకుంటుంది. అంతేగాని బిడ్డకు మాటలు నేర్పాలని తల్లినోరు బిడ్డ నోటిలో పెట్టి అమ్మా అని పలుకమంటే అది పలకటానికి వీలుకాదు. అదేవిధముగా గురువులు కూడా గ్రంథములద్వారా, వేదములద్వారా, ఉపనిషత్తుల ద్వారా విన్న విషయములను, కన్న విషయములను ఉచ్చరించవచ్చునే గాని జ్ఞానియైనవాడు తనకు తాను మాత్రమే ఆవిర్భవింపచేసుకోవాలి. ఈ ఆత్మ జ్ఞానమంటే ఏమిటి? అద్వైత దర్శనం జ్ఞానమన్నారు. అనగా అనేకత్వంలో ఏకత్వాన్ని unity in diversity ఇన్ని వేల మంది ఈ సమావేశములో కూర్చున్నారు. అందరి రూపనామములు వేరువేరుగా ఉంటున్నాయి. కాని అందరియందు ఉన్న ఆత్మతత్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి. కనుక సర్వత్రా చైతన్యరూపమైన దివ్యత్వం ఒక్కటేయని సుస్పష్టంగా గుర్తించాలి. కేవలం మాటలతో ఉచ్చరించటం కాదు. దీనిని అనుభూతిలోకి తెచ్చుకోవాలి. అట్టి జ్ఞానికి మాత్రమే నిరంతరము ఆనందము ప్రాప్తిస్తుంది. అట్టి ఆనందము ప్రాప్తించిన వ్యక్తి మాత్రమే జ్ఞాని అని చెప్పవచ్చు.

జ్ఞాని అనే ఉన్నత స్థాయిని పొందాలనుకుంటే మొట్టమొదట కర్మోపాసన దాటిరావాలి. కర్మోపాసన జయించక, సాధించక జ్ఞాని కావటానికే మాత్రం వీలుకాదు. ఎట్లనగా బి.ఏ. విద్యార్థి అని చెప్పాము. దీనిలో ఉండే అంతరార్థమేమిటి? స్కూలు ఫైనలు, ఇంటర్మీడియట్ ప్యాసైనాడని అర్థము సుస్పష్టంగా తెలుస్తోంది. ఈ స్కూలు ఫైనలు, ఇంటరు పాసవకుండా బి.ఏ. స్థానానికి రావటానికి వీలుకాదు. అదేవిధంగా యౌవనుడు అని ఒక పేరు వచ్చింది. ఈ యౌవనుడనే దాంట్లో బాల్యము దాటి వచ్చాడని సుస్పష్టమవుతుంది. బాల్యము, కౌమారము దాటక యౌవనుడు కాలేడు. ఇది ఒక పండు అని మనం చూపించినప్పుడు ఇది పిందె, కాయ స్థాయిలు దాటి వచ్చాక ఇది ఒక ఫలమైపోయింది. పిందె, కాయ దాటకుండా ఫలము కాలేదు.

అదే విధముగనే నేనొక జ్ఞానిని అని ఎవరైనా చెప్పవచ్చును. ఇది కేవలము వాచావేదాంతము కాని సత్యవేదాంతము కానేరదు. జ్ఞాని నిరంతరము ఆనందంతో ఉండాలి. అట్టి గుర్తులున్నాయా. పూర్వమితను కర్మకాండను, ఉపాసనకాండను దాటినాడా? అవి రెండును

sri sathyasai vahinamrutam

దాటక జ్ఞాని ఎలా అయ్యాడు? అసాధ్యము. కనుకనే వేదము కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండ ఒకదాని తరువాత ఒకటి అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. ఈ మూడింటి ద్వారా భగవంతుని యొక్క ఏకత్వాన్ని గుర్తించే నిమిత్తమై మూడు మార్గములుగా ఏర్పరచింది. వర్షం పడింది. వర్షము పడినందుకు గుర్తు ఏమి ఉండాలి. నేల తడిసి ఉండాలి. తడవకుండా వర్షము పడిందంటే ఇదియేమాత్రం సాధ్యంకాదు. నాకు జ్వరము వచ్చింది అని చెప్పవచ్చు. జ్వరం వచ్చిందంటే ఒళ్లు వేడిగా ఉండాలి కదా! ఏదో ఒక గుర్తు ఉండాలికదా లేక ధర్మామీటరులో చూపించాలికదా! కేవలం నాకు జ్వరం వచ్చిందంటే ఇదికేవలం ఒక స్టంట్. అదే విధంగా ఈనాడనేకమంది నేను జ్ఞానిని జ్ఞానిని అని తనకు తానే ఉచ్చరించుకుంటారు. ఇట్టి వేదాంతులే ఈనాడు ఎక్కువ అభివృద్ధి యై పోతున్నారు. ఇట్టి వేదాంతులలో కోటికొక్కరినైనా మనం గుర్తించటానికి వీలుకాదు.

### మానవుడు మంత్ర స్వరూపుడు

ఇట్టి వేదాంతాన్ని మనం పొందాలనుకుంటే మొట్టమొదట కర్మమార్గంలో ప్రవేశించాలి. ఈ కర్మమార్గంలో పవిత్రకర్మలు మనం ఆచరించాలి. సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగా భావించాలి. అట్లుకాక తనకు ఇష్టమైనవి మాత్రమే తాను ఆచరించి ఇది భగవత్ప్రీతి యని అంటే ప్రయోజనం లేదు. తన ఇష్టాయిష్టములను ప్రక్కకు నెట్టాలి. విశిష్టమైన కర్మలాచరించాలి. ఏది సక్రమమైనది అనే విషయాన్ని విచారించాలి. వేదవిహితమైన కర్మలేవియని విచారించాలి. తద్వారా మనకు తెలియకపోయినప్పటికిని మనయొక్క హృదయసాక్షిగా ఇది పవిత్రమైనది నేను చేస్తున్నాను అని సంకల్పసిద్ధిగా నీవు చేస్తే ఇదే పవిత్రమైపోతుంది. వేదశాస్త్ర ఇతిహాస పురాణములు మనం చదువనక్కరలేదు. చిత్తశుద్ధితో చేసిన ప్రతిపదము కూడా మంత్రముగా రూపొందుతుంది. మంత్రమనగా ఏమిటి? మననము చేసినదే మంత్రము. మననము చేసినది స్థిరంచేసుకోవటం త్రాణము. మన్-త్రమన్ అంటే మననము. త్ర అంటే త్రాణము. మనన త్రాణసమ్మిళితమైనదే మంత్రము. నీవు తలుచుకున్న దానిని స్థిరము చేసుకోవటమే ఒక మంత్రము. ఎట్టి మార్గములో? పవిత్రమైన భగవత్ మార్గములో మాత్రమే ఇది మంత్రమని చెప్పవచ్చు. కనుక మానవుడు మంత్రస్వరూపుడు తంత్ర స్వరూపుడు. యంత్ర స్వరూపుడు.

srisathyasaivahini

కనుక ఈ మంత్రతంత్ర యంత్రములకు మానవునియొక్క దేహమే ప్రత్యక్ష ఆధారము. దేహమే యంత్రము. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు సో-హం, సో-హం ఇదే మంత్రము. ఈ రెండింటికి అంతర్ముఖముగా ఆధారమై, అన్నింటిని ఆడించేది హృదయము అదే తంత్రము. హృదయము తంత్రము. దేహము యంత్రము. ఉచ్ఛ్వాస నిశ్వాసములు మంత్రము. కనుక మానవుడెంత పవిత్ర స్వరూపుడై ఉన్నాడు.

ఇట్టి దివ్యమైన మానవత్వాన్ని ఏవిధంగా మనం కోల్పోతున్నాము. మల, ఆవరణ, విక్షేపముల ద్వారా ఈ దివ్యత్వాన్ని మనం కోల్పోతున్నాము. దీనికి తగినట్లుగా మూడు వాసనలు కూడా దీనికి friendship అయిపోయి ఉంటున్నాయి. ఒకటి లోక వాసన, రెండవది దేహవాసన, మూడవది శాస్త్రవాసన. ఈ లోకవాసన అంటే ఏమిటి? ఈ భౌతికమైన జగత్తులో పేరు ప్రతిష్ఠలు రావాలి. అందరూ నాకంటె క్రింద ఉండాలి. అందరికంటె నేనే గొప్పవాడిని కావాలి. అందరూ నన్నే గౌరవించాలి. ఈ విధమైన సంకుచిత భావములు పెంచుకోవటం, ఈ లోకములో అన్నిరకములైన భోగభాగ్యములను అనుభవించాలి, ధనకనక వస్తువాహనాదులతో తులతూగాలి. ఈ భౌతికమైనవన్నీ ఎంతకాలము?

**కలలో చూసిన మేడలు మిద్దెలు**
**కన్నులు విప్పిన లేవుకదా.**

జాగ్రదవస్థలో ఏ భోగభాగ్యములు మనం అనుభవిస్తున్నామో నిద్రావస్థలో అవన్నీ శూన్యమైపోతాయి. ఒక అవస్థలో ఉండి రెండవ అవస్థలో కనుపించని వస్తువులు శాశ్వతమెలా అవుతాయి? ఇవి అసత్యస్వరూపాలు. త్రికాలబాధ్యంసత్యం. మూడుకాలములలో మార్పుచెందనిది ఏదో అదే సత్యం. కనుక ఈ భౌతికమైన పేరుప్రతిష్ఠలన్నీ అనిత్యము, అసత్యము అనే విచారణ చేసి ఈలోకవాసన దూరం చేసుకోవాలి.

ఇంక దేహవాసన. నా ఆరోగ్యం చక్కగా ఉండాలి. మంచి పుష్టిగా సంతుష్టిగా ఉండాలి. నేను మంచి అందమైన వాడిగా ఉండాలి. ఈ అందమునకు వేసుకునే పౌడర్లు, స్నోలు ఎన్ని వేసుకున్నప్పటికిని భగవంతుడిచ్చిన రంగు మాత్రం మారదు. అది శాశ్వతంగా ఉంటుంది. నీవు వేసుకున్న వన్నీ అసత్యములే. ఐదు నిముషములుండేటువంటివే. పరమ శాశ్వతమైన

sri sathyasai vachanamrutam

రంగు భగవంతుడిచ్చిన రంగే కనుక దానిని సత్యమైనదానిగా మనం తీసుకోవాలి. ఈ దేహమనేది కేవలం మల మూత్ర దుర్గంధ మాంసరక్తములతో కూడినది. దీనిని ఎంతవరకో అంతవరకే మనము జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎందుకంటే దివ్యమైన దైవత్వం పొందటానికిది ఒక ఆధారము. అంతేగాని ఇదే శాశ్వతమని దేనిపై ఒక మమకారం అభిమానం ఉంచుకొని దీనిలో మనం కాలము వ్యర్థము చేయరాదు. ఎంత అలంకారము చేసుకున్నప్పటికీ ఇది వట్టి వికారమే. ఉన్న ఆకారం మాత్రం మారదు. ఒక్కొక్కరు గంట రెండు గంటలు డ్రస్సింగు రూమ్‌లో డ్రస్సు చేసుకుంటూ ఉంటారు. ఇది కాలము వ్యర్థము. నీటి బుడగ వంటిది దేహము. ఆరోగ్యం అత్యవసరం. అదే మనం health is wealth. యీ దివ్యత్వము పొందేవరకు మన ఈ జీవితములో సార్థకం పొందేంతవరకు మనమీలోకములో ఉండినంత కాలము రోగములు రానివ్వకుండా, బలహీనత రానివ్వకుండా పరాధీనం కాకుండా చూసుకోటం మనకర్తవ్యము. కనుక దేహవాసన కూడా ఒక విధమైన దుఃఖమే.

ఇంక శాస్త్రవాసన. ఈ శాస్త్రము లెన్ని విధాల మనం చదివినా, వల్లించినా, నేర్చుకున్నా గొప్ప శాస్త్రజ్ఞుడని పేరు పొందినా అతనికి శాంతి ఉండదు. కారణమేమిటి? ఈ శాస్త్రములో ఏకొంచెం మరచిపోయినా అతనికి దుఃఖమే. ఎదుటి వ్యక్తితో ఓడిపోయినా దుఃఖమే. నిరంతరము ఈ దుఃఖమును కాపాడుకునే నిమిత్తమై తాననేక విధముల వల్లెవేస్తూ రావాలి. ఈ శాస్త్ర దుఃఖమనేది మరింత బాధకరమైనది. ఈ శాస్త్రమంటే శాసించినటువంటి విషయంలో చక్కగా నడచుకోవటమే. కేవలము గ్రంథపరిచయము మాత్రం శాస్త్రం కానేరదు. ఆచరణ పవిత్రమే నిజమైన శాస్త్రము. కనుక ఈ మల, ఆవరణ, విక్షేపములకు ఈలోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఈ మూడు చేరటం వల్ల మానవుడు మరింత మూర్ఖుడుగా మారిపోతున్నాడు. కనుక మనము ఏమీ తీసుకురాలేదు. ఏమీ తీసుకునిపోలేము.

**ఏమి తాగొనివచ్చె ఏమి తాగొనిపోయె**
**పుట్టినప్పుడు మరి గిట్టునప్పుడు**
**ధనము నెచ్చటకేగు తానేగునెచ్చటికి**
**చెప్పరయ్య మీరె ఒప్పుకొందు**

ఎవ్వరూ చెప్పలేరు. ఇవన్నీ కూడా కేవలము ఒకవిధమైన భ్రాంతితో మానవుని బంధించే త్రాళ్లు. ఈ బంధనవిమోచన గావించుకునే దివ్యత్వానికి దారితీయాలి.

**పవిత్ర మార్గములను ప్రబోధించునదే వేదము**

ఈ అస్థిరమైన లోకములో సుస్థిరస్థానాన్ని చేరే నిమిత్తమై పవిత్రమైన మార్గములను ప్రబోధించునదే వేదము. అయితే దీనికతీతమైన దానిని వేదము బోధించలేదు. ఎంతవరకు ఈ ప్రాకృత జీవితం గడుపుతామో అంతవరకు ఈ ప్రాకృత జీవితాన్ని పరిపూర్ణ మార్గంగా రూపొందింప చేయటానికి మాత్రం వేదము బోధిస్తూ వచ్చింది. ఆనందము కూడా వేదములో ఉన్నదని తాను తెల్పలేదు. ఈ దివ్యత్వమైన ఆనందము మనకెప్పుడు లభిస్తుందంటే దానినే బోధించింది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'. ఈ త్యాగము వలనే మనకు ఆనందం లభిస్తుందిగాని అంతకు మించివేదము చెప్పలేదు. అయితే తాత్కాలిక ఆనందము లెన్నియో బోధించింది. ఆకలిగొన్నప్పుడు ఆహారం ముందు పెట్టుకొని భుజించే సమయములో చాలా ఆనందము వేస్తుంది. ఆ ఆనందం ఎంతసేపు తిరిగి ఒక రెండు గంటలసేపు. తిరిగి ఒక రెండు గంటలు ఆకలివేస్తుంది. తిరిగి విచారము బయలు దేరుతుంది. ఆకలిగొన్నప్పుడల్లా అన్నం తినమని బోధిస్తుంది వేదం. అయితే ఈ అన్నము ఏరీతిగా భుజించాలి. ఎటువంటి అన్నమును భుజించాలి. ఎటువంటి కాలములో భుజించాలి, ఎలా భుజించాలి అనేది కూడా వేదము నేర్పుతూ వచ్చింది. అదే చమకములో బోధించినసారము.

ఈ నమకములో అన్నీ త్యాగాలు బోధిస్తూ వచ్చింది. నమస్కారము ఒకటి. అంటే మమకారం లేకుండా చేయటమే నమస్కారము. మమ అనే దానికి నమమ అనే దానికి ఎంతవ్యత్యాసము? మమ అనగా నాది నాది నాది. ఇదే ఒక వ్యాధి. నాది కాదు దీనినే వేదము నేతినేతి. ఇదే వేదాంతముయొక్క సారము. దేహము నేనుకాదు. మనసు నేను కాదు. ఇది నా మనసు. ఇది నా దేహము. నా దేహమనుకుంటే దేహమునకు, మనస్సునకు విరుద్ధంగా ఉంది కదా! నేను వేరు దేహము వేరుగా ఉంటుంది కదా. ఇది నా కర్చీఫ్ అనుకుంటే కర్చీఫ్ వేరు నేను వేరు. నాదేహము అనుకుంటే దేహము వేరు నేను వేరు. కాబట్టి దేహము నేనుకాదు. మనసు నేనుకాదు. బుద్ధి నేను కాదు. చిత్తము నేను కాదు. అంతఃకరణ నేను కాదు. ఇవన్నీ

sri sathyasai vachanamrutam

నేను కాదు. అన్నీపోయాక ఏది నిలచినదో అదే నేను. అదే ఆత్మ. నిలిచేది ఒక్కటే. అది ఉండటంచేతనే ఈ మనస్సు, బుద్ధి అంతఃకరణ ఇవన్నీ తమ తమ పనులు తాము చేస్తున్నాయి.

అట్టి ఆత్మతత్త్వము మనం గుర్తించుటకు తగినకృషి చెయ్యాలి. అదియే వేదాతీతమైన వేదాంతము. ఇట్టి వేదాంతములో ఏకించిత్ భాగమైనా మనము అనుభవించుటకు ప్రయత్నించాలి. సాధ్యమైనంతవరకు సత్కర్మలు చేయండి. పరోపకార సంబంధమైన సేవలు సల్పండి. జనసేవ చేయండి. సమాజ సేవలో పాల్గొనండి. భగవన్నామాన్ని ఉచ్చరించండి. అన్నీ కూడను ప్రేమతో మనం చేయాలి. ఏదో మెకానికల్‌గా చేయకూడదు. కేవలము ఏదో చెప్పారు జనసేవ చేయాలి, సమాజసేవ చేయాలి అని ఒక force తో పోరాదు. హృదయ పూర్వకంగా చేయాలి. బయటిది force. ఇది source.

**(తేది. 04-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam